# స్థానిక పోరులో 'యువకుల' రాజకీయం

- పంచాయతీ, పరిషత్ పోరుకు యువత సై
- ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్న యంగ్ లీడర్లు
- రిజర్వేషన్, అనుకూల స్థానాలపై సన్నిహితులతో చర్చలు
- సామాజిక వర్గాలను సైతం మచ్చిక చేసుకుంటున్న వైనం




**శెనార్తి మీడియా, గన్నేరువరం :**

రేపో, మాపో పంచాయతీ, పరిషత్ ఎన్నికలు జరగనున్నాయి. ఏ క్షణాన నోటిఫికేషన్ వచ్చేది తెలియదు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ కు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. దీంతో ఆయా పార్టీల్లోని యువ నాయకులంతా పల్లె పోరుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటి నుంచే తమ గ్రౌండ్ వర్క్ సిద్ధం చేసుకుంటున్నారు. ఆయా పార్టీల అధిష్టానాల ముందు సందర్భాన్ని బట్టి బల నిరూపణ చేసుకుంటున్నారు. ఇక తమ మనసులో మాట చెప్పకనే చెబుతున్నారు. ఈసారి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల్లో యువతకు ఏ పార్టీ ఎక్కువ అవకాశాలు కల్పిస్తుందన్నది ఆసక్తికరమైన అంశంగా మారింది.

**గన్నేరువరంలో 'యువకుల' రాజకీయం**

గన్నేరువరం మండల రాజకీయాల్లో యువత కీలకంగా మారుతోంది. అన్ని ప్రధాన పార్టీల్లోనూ యువ నాయకులు ప్రాధాన్యం వహిస్తున్నారు. ఊహించని విధంగా గ్రామ స్థాయి నుంచి మండల రాజకీయాల దాకా యువ నాయకుల చైతన్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిణామాలు భవిష్యత్ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశముంది.

**సామాజిక వర్గాల సమీకరణలో..**

యువ నాయకులంతా తమ సామాజిక వర్గాలతో పాటు ఇతర సామాజిక వర్గాలను సమీకరించే పనిలో పడ్డారు. ఆయా వర్గాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో తమకు సహకరించాలని కోరుతూ వస్తున్నారు.

ఈ పరిణామాలన్నింటి మధ్య గన్నేరువరం మండల రాజకీయ దృశ్యం కొత్త మలుపులు రూపుదిద్దుకోబోతున్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా యువకులంతా తమ నాయకత్వ పటుత్వాన్ని పెంచుకుంటూ వెళ్తున్నారు. ఈ మార్పులు భవిష్యత్ ఎన్నికల్లో కీలక ప్రభావాన్ని చూపే అవకాశం కనిపిస్తోంది.

**బీజేపీ నుంచి..**



ఇక బీజేపీ తరఫున తిప్పర్తి నికేశ్ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నాడు. పార్టీని పునఃసుస్థిరం చేయడంపై దృష్టి పెట్టిన నికేశ్, మండల యువతను తనవైపు తిప్పుకునేలా వ్యూహాలు రూపొందిస్తున్నాడు.

ఇక ముత్యాల జగన్ రెడ్డి సైతం స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు.ఇప్పటికే మండల వ్యాప్తంగా యువతతో కలిసి పనిచేస్తున్న జగన్ రెడ్డి, సమస్యల పరిష్కారానికి ముందుంటూ పలు వర్గాల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.

**కాంగ్రెస్ నుంచి..**



మండలంలో కాంగ్రెస్ నుంచి అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి వంటి యువ నాయకులు ముందు నిలుస్తున్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా ముసుకు ఉపేందర్ రెడ్డి దూకుడుగా ముందుకు సాగుతున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి లు ప్రయత్నిస్తున్నారు. ఇద్దరిలో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఎవరికి వస్తుందో, ఎమ్మెల్యే కవ్వంపల్లి ఆశీస్సులు ఎవరికి ఉంటాయో చూడాలి. అటు పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా ఉండి గన్నేరువరం మండలంలో పార్టీని ముందుండి నడిపించిన అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి సైతం స్థానిక సంస్థల ఎన్నికల్లో , లేదా పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది.

**బీఆర్ఎస్ నుంచి**



బీఆర్ఎస్ పార్టీ లో మాడుగుల రవీందర్ రెడ్డికి ఇప్పటికే పలు బాధ్యతలు నిర్వర్తించిన అనుభవం ఉంది. మాజీ జడ్పీటీసీగా ప్రజల్లో విశ్వాసం చూరగొన్నారు. మరోసారి జడ్పీటీసీలో బరిలో నిలిచేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలుస్తున్నది.

ఇక గన్నేరు వరం మండల కేంద్రానికి చెందిన గూడూరు సురేష్ సైతం స్థానిక బరిలో నిలిచేందుకు మొగ్గు చూపుతున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెంది న సురేష్ రిజర్వేషన్ అనుకూలిస్తే పోటీ చేసేందుకు మొగ్గుచూపుతున్నారు.

మరో యువ నాయకుడు పీచు మహేందర్ రెడ్డి సైతం పోటీకి సిద్ధమవుతున్నారు విద్యార్థి నాయకుడిగా కరీంనగర్ ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్వీలో చురుకైన పాత్ర పోషించాడు. పారువెల్ల గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డి రానున్న ఎన్నికల్లో గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు ఏదైనా ఒక పదవిలో బరిలో నిలవడం ఖాయమని తెలుస్తున్నది. పార్టీకి విధేయుడిగా పేరు తెచ్చుకున్న మహేందర్ రెడ్డి జిల్లాలోని ముఖ్య నాయకులకు అత్యంత సన్నిహితుడనే పేరుంది.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న కూడా రానున్న స్థానిక ఎన్నికల బరిలో నిలుస్తాడనే ప్రచారం సాగుతున్నది.

**శెనార్తి మీడియా కథనానికి స్పందన**

## వడ్ల కొనుగోలు కోసం జిల్లాలో పూర్తి స్థాయి ఏర్పాట్లు

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

యాసంగి పంటల సీజన్‌లో వరిధాన్యం కొనుగోలు కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం లక్షెట్టిపేట మండలం కొత్తూర్లో అంజనీపుత్ర గ్రామ సంఘం, వెంకట్రావుపేటలో వినాయక గ్రామైక్య సంఘం, ఎల్లారం గ్రామంలో రాజరాజేశ్వర గ్రామ సంఘం, గుల్లకోట గ్రామంలో లక్ష్మీప్రసన్న గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. అలాగే హాజీపూర్ మండలం గుడిపేటలో వెలుగురేఖ గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని కూడా పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతుల నుండి ఈ సీజన్‌లో అంచనా వేసిన 3.31 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యాన్ని కొనుగోలు చేయడానికి జిల్లాలో 321 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్రాగునీరు, నీడ ఏర్పాట్లు, ఓఆర్ఎస్ పొడియాలను అందుబాటులో ఉంచినట్టు వెల్లడించారు. గోనె సంచులు, టార్పాలిన్ షీట్‌లను అవసరాన్ని బట్టి సరఫరా చేస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలు సమయంలో ట్యాబ్‌లలో రైతుల వివరాలు నమోదు చేసి, తక్షణమే రశీదు జారీ చేయాలన్నారు. కొనుగోలు ధాన్యాన్ని ట్యాగ్ చేసిన రైస్ మిల్లులకు త్వరితంగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.



## రెవెన్యూ అధికారులపై పొంగులేటి ఆగ్రహం

**చట్టాలపై అవగాహన లేకపోవడంపై మండిపాటు**

నల్గొండ,ఏప్రిల్21: రెవెన్యూ అధికారుల తీరుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నల్గొండ జిల్లా చందంపేటలో భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు తమ భూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. రైతులు ఫిర్యాదుతో ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్‌లను మంత్రి ప్రశ్నలు అడగగా వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో రెవెన్యూ డివిజన్‌పై ఏమాత్రం అవగాహన లేకుండా ఎలా ఉన్నారని ఆర్డీవోపై పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఇకపోతే అంతకుముందు ఇబ్రహింపట్నంలో జరిగిన సదస్సులో మంత్రిపాల్గొన్నారు. రైతుల సమస్యకు భూభారతి తీసుకుని వచ్చామని అన్నారు. ధరణితో అక్రమాలు చోటు చేసుకున్నాయని, వాటికి ఇందులో చెక్ పెట్టామని అన్నారు.



## భారత్ చేరుకున్న జేడీ వాన్స్

- ప్రధాని మోడీతో ప్రత్యేకంగా సమావేశం

**న్యూఢిల్లీ, ఏప్రిల్21:**

భారత పర్యటనకు వచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దిల్లీ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ- అయ్యారు. ఇరునేతల మధ్య వాణిజ్యం, సుంకాలు, ప్రాంతీయ భద్రతతోపాటు పలు ద్వైపాక్షిక అంశాలు చర్చకు రానున్నట్లు- సమాచారం. అమెరికా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జేడీ వాన్స్ భారత్ పర్యటనకు రావడం ఇదే తొలిసారి. ఆయన వెంట భార్య ఉషా వాన్స్, ముగ్గురు పిల్లలతో పాటు- ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధులు ఉన్నారు. సోమవారం ఉదయం దిల్లీలో దిగిన జేడీ వాన్స్ దంపతులకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఇతర అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వాన్స్ పిల్లలు మీడియా దృష్టిని ఆకర్షించారు. కుమారులు ఇవాన్, వివేక్, కుమార్తె మీరాబెల్ భారతీయ సంప్రదాయ దుస్తుల్లో కన్పించారు. అనంతరం వారు దిల్లీలోని అక్షర్‌ధామ్ ఆలయాన్ని సందర్శించారు. భేటీ అనంతరం వాన్స్ దంపతులు, అమెరికా అధికారులకు ప్రధాని మోదీ ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ట్రంప్ టారిఫ్ దూకుడు వేళ.. ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఏసీబీకి చిక్కిన లంచగొండు ఉద్యోగులు

**నాలుగు చోట్ల నలుగురు పట్టివేత**

**హైదరాబాద్,ఏప్రిల్21:**

ఏసీబీ అవినీతి అధికారుల భరతం పడుతోంది. ఒక్క రోజే పలు ప్రాంతాల్లో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సీఐ, జనగామ జిల్లా చిల్పూర్ తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారి, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పంచాయతీరాజ్ సీనియర్ అసిస్టెంట్ పట్టుబడగా..తాజాగా లంచం తీసుకుంటూ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా నాగారం మున్సిపల్ డీఈ రఘు ఏసీబీకి దొరికాడు.

నాగారం మున్సిపాలిటీలో రమేష్ అనే కాంట్రాక్టర్ దగ్గర రూ. 75 వేల లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నాగారం మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. జనవరి 27 , 2025 నుంచి నాగారం మున్సిపాలిటీ- పదవి కాలం పూర్తయింది. ఆ రోజు నుంచి జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్త స్పెషల్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టారు. జిల్లా అధికారి స్పెషల్ ఆఫీసర్ ఉన్నా.. అధికారులు లంచం తీసుకోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం మణుగూరు పోలీస్ స్టేషన్ లో ఏసీబీ అధికారులు రైడ్ చేశారు. పీఎస్ లో రూ. లక్ష లంచం తీసుకుంటుండగా సీఐ సతీష్ కుమార్, ఆయన అనుచరుడు ఓ తెలుగు న్యూస్ ఛానల్ జర్నలిస్ట్ ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఓ భూమి సెటిల్ మెంట్ విషయంలో ఆరుగురు వ్యక్తుల దగ్గర నుంచి రూ.15 లక్షల వర కు డిమాండ్ చేశాడు మణుగూరు సీఐ సతీష్ కుమా ర్. 4 లక్షలు ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. ఇందులో భాగంగా ముందుగా రూ. లక్ష పీఎస్ లో సీఐ అనుచరుడికి ఇస్తుండగా.. ముందస్తు ప్రణాళికతో ఏసీబీ అధికారులు అతడిని పట్టుకున్నారు. లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డ టీవీ ఛానల్ జర్నలిస్ట్ తో పాటు స్టేషన్ సీఐ ఫోన్లను తీసు కుని ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు. లంచం తీసుకుంటూ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎసిబి అధికారులకు పట్టుబడ్డాడు. ఈ సంఘటన జనగామ జిల్లా, స్టేషన్ ఘ న్‌పూర్ మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఎసిబి డిఎస్‌పి సాంబయ్య కథనం ప్రకారం.. చిల్పూరు మండలానికి చెందిన ఆవుల లింగయ్య తన 1.20 ఎకరాల భూమిని సర్వే చేయమని కోరగా ఆర్ఐ వినయ్‌కుమార్ రూ.26 వేలు లంచం డిమాండ్ చేశాడు. ఈ విషయాన్ని బాధితుడు ఎసిబి అధికారులకు వివరించాడు. వారి సూచనల మేరకు సోమ వారం కార్యాలయంలో ఆ డబ్బులు స్వయంగా తీసుకుంటుండగా ఆర్ఐని పట్టు-కున్నారు. ఇటీవల స్టేషన్ ఘన్‌పూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి దాడి ఘటన మరువకముందే మళ్లీ దాడి జరగడంతో నియోజకవర్గ కేంద్రంలో చర్చనీయాంశమైంది. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎసిబి డిఎస్‌పి తెలిపారు.

## ఒసాకా ఎక్స్‌పోలో తెలంగాణ పెవిలియన్

**పెవిలియన్‌లో భారత రైజింగ్ బృందం**

హైదరాబాద్,ఏప్రిల్21: జపాన్‌లోని ఒసాకాలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఒసాకా ఎక్స్ పోలో తెలంగాణ రాష్ట్రం తన ప్రత్యేకమైన పెవిలియన్‌ను ఘనంగా ప్రారంభించింది. కిటాక్యూషు నుంచి ఒసాకా చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సోమవారం ఉదయం భారత పెవిలియన్లో అడుగుపెట్టింది. భారత పెవిలియన్లో ప్రత్యేకంగా ఏర్పాటు- చేసిన తెలంగాణ జోన్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు, ఐటీ- పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ప్రారంభించారు. ??ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఒసాకో ఎక్స్ పో నిర్వహిస్తారు. ఒసాకో ఎక్స్ పోలో పాల్గొన్న మన దేశంలోని తొలి రాష్ట్రం తెలంగాణ కావటం విశేషం. ఒసాకా ఎక్స్ పో వేదికపై తెలంగాణ తన వైవిధ్యమైన సంస్కృతి, అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక అనుకూల వాతావరణం, సాంప్రదాయ కళలు మరియు పర్యాటక ఆకర్షణలను ప్రపంచం నలుమూలాల నుంచి వచ్చే సందర్శకులకు చాటిచెప్పనుంది. తెలంగాణ పెవిలియన్‌లో రాష్ట్ర సాంకేతిక పురోగతి, సాంస్కృతిక వారసత్వం, పర్యాటక సంపదను ప్రతిబింబించే ప్రదర్శనలు ఏర్పాటు- చేశారు. ఈ వేదిక ద్వారా అంతర్జాతీయ పెట్టు-బడులను ఆకర్షించడంతో పాటు-, సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించే దిశగా తెలంగాణ అడుగులు వేస్తోంది.

## నేడు తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల

హైదరాబాద్,ఏప్రిల్21: తెలంగాణలో ఇంటర్ ఫలితాలను విడుదల చేసేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు- చేశారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంటర్ ఫలితాలు విడుదల చేస్తారని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య వెల్లడించారు. మరో మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొననున్నారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ ఫలితాలను ఒకేసారి విడుదల చేయబోతున్నారు. కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 10 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.. ఫలితాలను సీజీజీ ప్రాసెస్ చేసింది.. వాళ్ళకి వారం టైమ్ కావాలని అడిగారు ఇచ్చాం. 2 గంటల తర్వాత ఫలితాలు వెబ్ సైట్ లో అందుబాటులో ఉంటాయి.. సర్వర్ లో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నాం.. 60 లక్షల జవాబు పత్రాలను కరెక్షన్ చేశాం. పేపర్ కరెక్షన్ పక్రియలో 18,500 మంది టీచర్లు పాల్గొన్నారు.. పారదర్శకత కోసం అన్ని సెంటర్ లలో సీసీ కెమెరాలు పెట్టాము.. ఆన్సర్ స్క్రిప్టులను రాండమ్ గా చెక్ చేసాము.. పరీక్ష ఫలితాల్లో ఎలాంటి పొరపాట్లు రాకుండా లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.